ఓం నమోభగవతే శ్రీరమణాయ

# ఉమా సహస్రము

## ( ఏడవ శతకము – తృతీయస్తబకము)

### సప్తవింశ స్తబకము

**అవ:**- 'ప్రచండచండి' అనునది ఈ మహాకవి కభీష్టయగు భగవతీమూర్తి. ఈ యిరువదేడవ స్తబకమునం దామూర్తిని స్తుతించుచున్నారు.

మూ॥ విధున్వన్ ధ్వాన్తాని ప్రతిదిశ మధర్మం పరిహరం
ఛ్ఛ్రియం వ్యాతన్వానస్సపదిశమయన్ దుఃఖపటలమ్.
సహస్రారామ్భోజే ద్రవమసదృశం మే ప్రజనయన్
ప్రచణ్డాయాశ్చణ్డ్యాశ్స్మితహసితలేశో విజయతే। 1

సర్వదిశలయందును – చీకటులను విరియంజిమ్ముచు, నిశ్శ్రేయస ప్రతిబంధకమగు అధర్మమును (పాపమును) పరిహరించుచు, సంపదను గలిగించుచు, దుఃఖపటలమును వెంటనే తొలంగించుచు, నాశిరస్సునందున్న సహస్రారకమలమునందు సాటిలేని యమృతధార నొదవించుచు, ప్రచండయగు చండీదేవియొక్క తెల్లని మందహాసము వెలయుచున్నది.

**ప్రభ:**- మిక్కిలి యుగ్రమగు మూర్తిగల ప్రచండచండీ దేవీయొక్క శుభ్రమగు మందహసితము – సకల పురుషార్థ విధాయకమను నంశము - మూలమునందలి పూర్వార్ధముచేతను, కవి యనుభూతి, తృతీయపాదము చేతను తెలుపంబడినది.



అదెట్లనిన– 'అధర్మమును పరిహరించుచు' అనుదానిచేత – ధర్మ సిద్ధియు, 'సంపదను గలిగించుచు' అనుదానిచేత – అర్థలబ్ధియు, 'దుఃఖపటలమును తొలంగించుచు' అనుదానిచేత – సుఖప్రదమగు కామప్రాప్తియు, 'చీకటులను విరియంజిల్లుచు,' అనుదాని చేత – మోక్షోపయోగియగు ప్రకాశోపలబ్ధియుం, దెలుపంబడినవి. ఇట్లు ప్రభా విశిష్టమగు దేవీ మందహాసము – శిరస్సునందలి సహస్రదళకమలమున వెలయుచు అమృతమును స్రవింపంజేయుచున్నదని **స్వానుభూతి** ప్రదర్శింపంబడినది. ఇట్లు ధర్మ – అర్థ – కామ – మోక్ష – ప్రాప్తియు, స్వానుభూతియు, దేవీ శుభ్ర మందహసిత ప్రభావముననే లభించినవని ప్రకటింపంబడినది.

మూ॥ అరిణాం శీర్షేషు జ్వలిత దవకీలీస్సదృశం
వినమ్రాణాం శీర్షే ష్వమృతకర బిమ్బేనతులితమ్।
విరోధిధ్వాన్తానాం తరుణ తరణి ప్రాభవహరం
ప్రచణ్డాయాశ్చణ్డ్యాశ్చరణ మసతాం హన్తు విభవమ్॥ 2

శత్రుల శిరస్సులయందు – మండుచున్న శ్రేష్ఠమగు దవాగ్నికి సదృశమగునదియు, వినతులగు భక్తుల శీర్షములయందు – అమృతకర బింబముతో తుల్యమగునదియు, విరోధులగు ధ్వాంతములకు (జ్ఞాన ప్రతిబంధకములగు చీకటులకు) బాలార్కుని కంటెను పటుతరమగు నదియు, అగు ప్రచణ్డచండీ చరణము – దుర్జనుల ఐశ్వర్యమును నశింపంచేయుగాత!

**ప్రభ:**-''భక్తుల శీర్షముల యందు – అమృతకరబింబముతో తుల్యమగునది'' అనగా, '' ఉపాసకుల సహస్రదళకమలమునందుండి యమృతమును వర్షించునది'' అని యర్థము నెఱుంగునది. ఇందు – ఒక్కటియే యగుచరణము – అగ్ని – చంద్ర – సూర్యులొనర్చు కార్యముల నతిశయించు కార్యముల నొనర్చునట్లుల్లేఖించుట వలన. ఉల్లేఖాలంకారమును, అగ్ని మొదలగు

వానితోడి యుపమానమును దెలుపుట వలన ఉపమాలంకారమును గలవు. ఈయలంకారములు రెండును – స్పష్టముగాఁ దెలియబడుచు – తిలతండులము వలె, మిళితములై 'సంసృష్టి' అనునలంకారమగుచున్నదని గ్రహించునది.

మూ॥ భజేభాసాం శాలాం నిఖిలధిషణానాం జనిభువం
బలానామాధాత్రీం నిఖిలభువనేన్ద్రస్య దయితామ్।
భజన్తే యాంగీతైర్మధుసమయమాద్యత్ పికవధూ
కలాలాపా హృద్యై ర్హయవదన పఙ్కేరుహ దృశః॥ 3

వసంతసమయమున మదించిన స్త్రీకోకిలవలె అవ్యక్తమధుర స్వరములు గల కిన్నెర పంకజాక్షుల హృదయంగమములగు గీతములచేత స్తుతింపఁబడునదియు, జ్యోతులకాశ్రయస్థానమును, లౌకికములును - శాస్త్రీయములును – అగు సకల ప్రజ్ఞలకును జన్మభూమియు, విద్యా-బుద్ధి - పరాక్రమాదిబలముల కుత్పాదయిత్రియు, సర్వలోకేశ్వరదయితయు, అగు దేవిని- (పార్వతిని) భజించెదను.

**ప్రభ:-** మహాకవి కాళిదాసు – కుమారసంభవమున ''భిన్నన్తిమన్దాంగతిమశ్వముఖః'' అని హిమాలయమునందున్న అశ్వముఖులగు కిన్నెర స్త్రీలను వర్ణించి యున్నాడు. కావున నిచట కిన్నర స్త్రీలచేత – సేవింపఁబడిన దేవి -హిమాచలవాసినియగు పార్వతియేయని తోచుచున్నది.

మూ॥ జ్వలన్తీ తేజోభిర్మహిష మథనే యాతవతను-
ర్లసన్తీ లావణ్యైర్గిరిశ రమణే యాతవతనుః।
వినాక్రోధ ప్రీతీ నకిమపి తయోర్భేదకమ భూత్
తయోరాద్యా దుర్గాభవతి లలితాన్యా మునినుతే॥ 4



మునిస్తుతవగు దేవీ! మహిషాసురుని మర్దించు విషయమున నీ శరీరము - తేజస్సుల చేత (ప్రతాపముల చేత) జ్వలించునదయ్యెను. శివరతి విషయమున, నీ శరీరము – లావణ్యముల చేత విలసిల్లునదయ్యెను. ఈ శరీరముల నిట్లు వేరుపఱచినది క్రోధము, ప్రీతియుఁ, గాక, ఇంకేదియుఁగూడఁగా నేరదు. ఈ మూర్తిద్వయమున మొదటిది దుర్గాదేవి. రెండవది లలిత (గౌరి).

**ప్రభ:-**ఒకతివే యగు నీవు క్రోధ విశిష్టవగునపుడు – జ్వలన్మూర్తివై దుర్గవును, ప్రీతి విశిష్టవగునపుడు, లసన్మూర్తివై లలితవును అగుచున్నావని భావము. 'తేజస్సులచేత' అనుచోనున్న బహువచనము చేత, సర్వాంగముల నుండియు శత్రుహృదయ భేదకమును, రౌద్రతావహమును, అగు ప్రతాపము – విస్తారముగా విజృంభించుట – ద్యోత్యము. అట్లే 'లావణ్యముల చేత' అనుచో నున్న బహువచనము చేత – శివరతి పోషకమగు సర్వాంగ సౌందర్య విలసితము – గమ్యము.

మూ॥ సహస్రం భానూనాం భవతి దివసానామధిపతేః
సహస్రం శీర్షాణాం భవతి భుజగానామధిపతేః
సహస్రం నేత్రాణాం భవతి విబుధానామధిపతేః
సహస్రం బాహూనాం భవతి సమమే హైమవతి! తే! 5

దివసములకధిపతియగు సూర్యునకు కిరణ సహస్రము కలదు. భుజగములకధిపతియగు శేషునకు – శిరస్సహస్రము కలదు. దేవతలకధిపతియగు నింద్రునకు – నేత్ర సహస్రము కలదు. హైమవతీ! సమయము (అవసరము) కలుగునపుడు – నీకు – బాహు సహస్రము కలదు.

**ప్రభ:-** దుష్ట శిక్షణ సమయము ప్రాప్తించిన కాలమున – నీ పరాక్రమము– బహువిధముల విజృంభించునని భావము.

మూ॥ ప్రసన్నోవక్త్రేన్దు ర్నచనయనయోః కోఽప్యరుణిమా।
నకమ్పోబిమ్బోష్ఠే స్మితమపి లసత్ కాశ విశదమ్।
సరోజాభః పాణిః కిణవిరహితః కోమలతమః॥
జ్వలచ్ఛూలం త్వాసీజ్జనని! తవశుమ్భాయభయదమ్ 6

జననీ! నీముఖ చంద్రుఁడు – ప్రసన్నుడు. అచట రోషలాంఛనము కొంచెము గూడ – కాన్పింపదు. నేత్రములయందు క్రోధసూచకమగు నరుణిమ యేదియు లేదు. బింబాధరమున క్రోధవ్యంజకమగు కంపము లేదు. మందహాసము కూడ – కాశపుష్పము వలె తెల్లనై వెలయుచుండును. కమలసన్నిభమును, కోమలతమమును, అగు పాణి – మాటిమాటికి ఆయుధమును గ్రహించుట చేత, గలిగిన గ్రంధిరూపమగు కిరణములు లేనిది. అయినను జ్వలించుచున్న నీశూలాయుధము మాత్రము – శుంభునకు భయప్రదమయినది.

ప్రభ:- ముఖచంద్ర – నయన – బింబాధర – మందస్మిత – పాణికమలము లిట్లు లావణ్యమయములును, ప్రియదర్శనములును, అగుచున్నను - ప్రజ్వలించుచున్న శూలాయుధము మొక్కటియే. శుంభునకు భయము కలిగించెనని భావము. ముఖప్రసన్నతాది సౌమ్యగుణములకు – అనురూపము గాని భయంకర శూలమున కిచట – ప్రసక్తి చెప్పబడుట వలన – నిది విషమాలంకార మగుచున్నది. 'అననురూపసంసర్గము – విషమము, అనునది – రసగంగాధర లక్షణము – ఇచట సమన్వయించును.

మూ॥ వధే శుమ్భస్యాసీత్ తవజనని! యాకాచనతనుః
దధానాగ్ర్యాః శక్తీః శశికిరణసారోపమరుచిః॥
ఇమాం ధ్యాయం ధ్యాయం స్మరహరసఖి వ్యాకులమిదం
మనోమేవిశ్రాన్తిం భజతి భజతాం కల్పలతి తే॥ 7



జననీ! కామారి ప్రేయసీ! భక్తాభీష్టదాయినీ! శ్రేష్ఠములును, బ్రహ్మాణీ ప్రముఖములును, అగు శక్తులను భరించుచున్నదియు, చంద్రకిరణసారమగు నమృతముతో నుపమింపఁదగిన శోభగలదియు, అనిర్వాచ్యయగు నదియు, అగు ఏ నీ మూర్తి- శుంభాసురుని వధించెనో, ఆ యీ (సంపూర్ణ) మూర్తిని, ధ్యానించి, ధ్యానించి, వ్యాకులమగు నాయీ మనస్సు – విశ్రాంతి నొందుచున్నది.

మూ॥ యదిత్వం సంసారే పటు రసిసవిత్రి! త్రిజగత
స్తదేతత్ త్వాంయాచే సరసిరుహ గర్భాదివిను తే!
ఇమేమే పాప్మానోభగవతి! వదన్తోబహువిథా
స్తదేషుప్రఖ్యాతం ప్రతిభయతమం దర్శయబలమ్ 8

త్రిజగజ్జననీ! బ్రహ్మాదిసంస్తుతా! దేవీ! నీవు సంహార కార్యమున సామర్థ్యము గలదానవగు నెడల నిన్ను నా బుద్ధియందున్న యీ యభిలాషము నడుగుచున్నాను. కావున వానిని ధ్వంస మొనర్చుటకు, ప్రఖ్యాతమును భయంకరతమమును అగు నీ బలమును – ప్రదర్శింపుము.

ప్రభ:- వీర్యవంతములగు నాయీ పాపములను తొలగించు విషయమున– నీ సంహార నైపుణ్యమును ప్రదర్శింపుమని భావము.

మూ॥ బిభేదోరః క్రోధాత్ కనకకశిపో రబ్ధితనయా।
కుచగ్రావోల్లీఢైరతి శితశిఖైర్యః కిలనఖైః॥
త్వయాదత్తాశక్తిర్నరహరి శరీరాయజగతాం
వినేత్రేపుంసేఽస్మై జనని! రణరఙ్గస్థలరమే॥ 9

యుద్ధరంగమున విజయధాత్రివగు జననీ! (లక్ష్మీ!) క్షీరసాగర పుత్రియగు లక్ష్మియొక్క కుచములను శాణోపలములయందు (సానరాళ్ళయందు) ఘర్షితములయినవియు (పదునుచేయఁబడినవియు), కావుననే మిక్కిలి వాడియగు

శిఖలు (చివరలు) గలవియు, అగు నఖముల చేత - దైత్యనాయకుఁడగు హిరణ్యకశిపుని యొక్క వక్షమును - రోషము వలన విదారించిన (చీల్చిన) జగన్నియంతృ పురుషుఁడగు నరసింహునకు నీవే శక్తి నొసఁగితివట.

ప్రభ:- హిరణ్యకశిపుని వధించుటకు నరసింహమూర్తికి - నీవే - నారసింహియను శక్తి నొసఁగితివి. అయినను లోకము నందలి జనులు - విష్ణువు - హిరణ్యకశిపుని సంహరించెనని చెప్పుదురని భావము.

మూ॥ అజేయస్త్రైలోక్య ప్రకటితపతాకః ఫలభుజాం
బిడౌజాయత్ కారాగృహపరిచయీ పఙ్క్తివదనః
సహస్రారం సాక్షాద్ధృత నర శరీరం తమజయత్
త్వయైవా వేశేన ప్రియపరశురమ్బ! ద్విజశిశుః॥ 10

అమ్మా! జయించుటకు శక్యుఁడుకాని వాఁడును, త్రిలోకములయందును ప్రకటింపఁబడిన జయపతాకగలవాఁడును, మాంస భోజనులగు రాక్షసులకు నాయకుఁడును. అగు దశముఖుని (రావణుని) కారాగార పరిచయము గల వానినిగా నొనర్చినవాఁడును, సహస్రార చక్రము చేత ప్రత్యక్షముగా ధరింపఁబడిన మానవ శరీరము గలవాడును, అగు కార్తవీర్యార్జునుని - ప్రియమగు పరశువు (కుఠారము) గలవాఁడును, బ్రాహ్మణబాలుఁడును, అగు పరశురాముఁడు నీ యొక్క ఆవేశ బలము చేతనే జయించెను.

ప్రభ:- సహస్రదళ చక్రము - మానుష విగ్రహమును స్వీకరించి సహస్రబాహుడగు కార్తవీర్యార్జునుఁడయ్యెను. అతఁడు త్రిలోక విజయియగు రావణుని కారాగారమున బంధించిన మహా పరాక్రమవంతుఁడు. పరశుధారియగు ద్విజ శిశువు పరశురాముఁడతనిని జయించెను. అపూర్వమగు నీ శక్తి - పరశురామునకు, నీయావేశ బలము చేతనే కలిగినదని భావము. ''జమదగ్ని' అను మునియొద్ద నొక కామధేనువుండెను. కార్తవీర్యార్జునుఁడు దాని నడుగగ



నాముసీంద్రుఁడీయఁడయ్యెను. కోపోద్రిక్తుఁడగు కార్తవీర్యుఁడతనిని వధించెను. తత్పుత్రుండు పరశురాముఁడు తత్ ప్రతీకారము కొఱకు మొదట - కార్తవీర్యుని, తరువాత నిరువది యొక్కమారులు క్షత్రియవంశమును నిర్మూలించెను.'' అను పురాణగాథ నిచట ననుసంధించునది.

మూ॥ త్వదీయా సాశక్తి స్సకల జగదస్తేఽప్యనలసా।
పురాకార్యస్యాన్తే తనయ మయిహిత్వా నృపరిపుమ్।
అవిక్షత్ కాకుత్స్థం దశముఖ కులోన్మాథవిధయే
సహస్రాంశుం హిత్వాశశిన మివఘస్రేగలతిభా॥ 11

జననీ! సర్వ లోకములను నశింపఁ జేసియుఁగూడ- విశ్రమింపని నీయా శక్తి - దినాంతకాలము నందు సహస్రాంశుండగు సూర్యుని విడిచి చంద్రుని యందు సంక్రమించిన ప్రభవలె, పరశురాముని చేత ప్రతిజ్ఞ చేయఁబడిన, క్షత్రవధరూప కార్యము ముగిసిన పిదప - క్షత్రియశత్రువగు పరశురాముని విడిచి - కాకుత్స్థుఁడగు శ్రీరాముని - రావణ (రాక్షస) కుల ధ్వంసము కొఱకు ఆవేశించెను.

ప్రభ:- సాయంకాలమున సూర్యుని విడిచి - చంద్రునాశ్రయించిన వెలుతురువలె, కార్యాంతమున పరశురాముని విడిచి, నీ సంహారశక్తి - శ్రీరాము నాశ్రయించెనని భావము. పరశురాముఁడును, శ్రీరాముడును, సమకాలికులును రామాయణ కథా ప్రసిద్ధులును అగుచున్నారు. ఈ యిరువురును గూడ - నవతార పురుషులగుట యెట్లు సంఘటించుననను సంశయము - మీదిఁశ్లోకమున పరిహరింపఁబడినది. అవతార తత్త్వవేత్తయును, నైష్ఠికుఁడును కవియునగు, ఈయాచార్యుని యభిప్రాయమిది - అవతారము లన్నిఁటియందును గూడ - అవతార పురుషద్వారమున - మహాశక్తియే కార్యమును నిర్వహించుచుండును. భుజబలదర్పాంధులగు క్షత్రియులను వధించుట చేత - తపోబలమును ప్రదర్శించుట - పరశురామావతారము యొక్క కార్యము. ఆ కార్యము ముగిసిన

పిదప – ఆ శక్తి – ధర్మ విద్వేషియగు రాక్షసకులమును నిర్మూలించుటకు రాముని యందావేశించెను. కావున పరశురాముఁడును, శ్రీరాముఁడును శ్రీ మహావిష్ణుని యవతారమూర్తులై వేర్వేరుపనులను గావించుట – సంఘటించుచున్నది. మూలమునందలి కులపదము చేత – రావణునికి సంబంధించిన రాక్షసకులము గ్రహింపఁదగుచున్నది. కాని వాని కుటుంబము మాత్రమే గ్రహింపఁదగదు. ఇచ్చట – ''పర్యాయోయది పర్యాయేణైకస్యానేక సంశ్రయః'' అను లక్షణము వలన ఒక్కటియే యగు ప్రభ – సూర్యుని, చంద్రుని, సంశ్రయించినట్లు చెప్పుటవలన పర్యాయ మలంకారమగుచున్నది. మఱియు నిచ్చట – బ్రాహ్మణబాలుఁడగు పరశురాముని విడిచి – శ్రీరాముని యందు ప్రవేశించిన శక్తికిని – సూర్యుని విడిచి – చంద్రుని యందు ప్రవేశించిన ప్రభకును – ఒక యాశ్రయమును విడిచి యింకొక యాశ్రయము నాశ్రయించుట యను సాధర్మ్యము వలన ఉపమయలంకార మగుచున్నది. ఇందుపమ – ప్రధానమును, పర్యాయమంగమును, అగుచున్నది. కావుననిది – యంగాంగి భావము చేనగు సంకరమగుచున్నది.

మూ॥ హ తేలోకత్రా తేభగవతి! భవత్యేవ సపురా
మరిః కీర్తింలబ్ధుం చతురమతి రాయాతిసమయే
త్వయాలోకత్రాణే జనని! రచితే రాక్షసవధాద్
యశోఽవాప్తుం విష్ణుర్మిలతిచకుతోఽప్యేషనిపుణః 12

భగవతీ! లోకవ్రాతమంతయు నీచేతనే సంహరింపఁబడుచుండ - చతురమతియు, త్రిపురాంతకుఁడును, అగు హరుఁడు – ప్రలయకర్త (సంహారకర్త) అను కీర్తినొందుటకు కార్యావసాన సమయమున వచ్చుచుండును. జననీ! రాక్షసవధము వలన నీచేతనే జగద్రక్షణము కావింపఁబడుచుండ, ఏదోస్థానము నుండి నిపుణుఁడగు ఈ విష్ణువు 'లోక రక్షకుఁడు' అను కీర్తినొందుటకు వచ్చుచుండును.



ప్రభ:- హరునియందుఁగల సంహారకారిణియగు శక్తియు, విష్ణునియందున్న స్థితి కారిణియగు శక్తియు నీవేయగుచున్నావు. లేక ఉభయరూపమగు ఆ శక్తి – నీయదియే అని భావము.

మూ॥ స్వరూపం తే వజ్రం వియతి రజసాం సూక్ష్మమహసా
ముపాధిస్తే స్తోమోభవతి చపలాకాఽపితనుభా।
అరుద్ధా తేవ్యాప్తిర్బలమఖిలదత్తం బలనిధేః
సహస్రాంశః స్వస్యప్రభవసి సమస్తస్యచ శివే!॥ 13

శివా! వజ్రాయుధము – నీ స్వరూపము. (ప్రకృతి) ఆకాశమునందున్న సూక్ష్మమగు జ్యోతిస్సమూహము– నీయుపాధి ( ఆశ్రయము) మెరుపు– అనిర్వచనీయమగునీ శరీర ప్రభ. నీ సర్వ వ్యాపిత్వము అప్రతిహతము. బలనిధివగు నీయొక్క సహస్రాంశము – అఖిలవిశ్వమునకును దత్తమగు బలమగుచున్నది. సర్వలోకమునకునుగూడ – నీవు ప్రభువవు.

ప్రభ:- విశ్వము యొక్కబలము – జ్యోతిర్మయివి, సర్వవ్యాపినివి, అగు నీయొక్క అమేయ బలమునందలి సహస్రాంశమే (అత్యధికమగు భాగమునందలి అత్యల్పభాగమే) అగును. అని భావము.

మూ॥ యతఃకాలవ్యాజాత్ పచసి భువనం వైద్యుతమహః-
ప్రభావాత్ కాలీం త్వామయి విదురతః పణ్డితవరాః।
ప్రభోః శస్త్రం భూత్వాదహసి యదరీన్ వజ్రవపుషా
ప్రచణ్డాం చణ్డీం తద్ భగవతీ! భణన్త్యక్షయబలే! 14

అమ్మా! కాలవ్యాజము గల (కాలమనుమిషగల) విద్యుత్ సంబంధియగు జ్యోతిస్సుయొక్క ప్రతాప విశేషము వలన, భువనమును పక్వము చేయుటవలన విజ్ఞులు నిన్ను కాలివని గ్రహించుచుందురు. అక్షయబలా! భగవతీ! ప్రభువగు

(పరమేశ్వరుఁడగు) ఇంద్రునకు నీవాయుధమవై వజ్రరూపమగు శరీరము చేత - శత్రువులను దహింతువు. కావున పండితశ్రేష్ఠులు నిన్ను - ప్రచండవగు చండివని (ప్రచండచండీ దేవివని) చెప్పుదురు.

ప్రభ:- భగవతియగు దేవి కాలమను సాధనము చేత - సర్వమును పాకముచేయునను ప్రతీతియున్నది. కాని వైద్యుతమగు జ్యోతి ప్రభావము చేతనే యథార్థముగా పాకము నిర్వహింపఁబడును. కావున పాకము - కాలముచేత నొనర్పఁబడుననునది సత్యము కాదని యపహ్నవము. కాలీ - కాలగతమగు భేదము - లింగమాత్రమేయని పూర్వోక్తమగు నంశము నిచట స్మరించునది. 'ఇది' పరమైశ్వర్యే, అను ధాత్వర్థము ననుసరించుట వలన ''ఇంద్రుఁడే పరమేశ్వరుఁడు, అతని శక్తి యగు ఇంద్రాణియే ప్రచండచండి'' అనునది కవియభిప్రాయము. మహాకాలుఁడగు రుద్రునిపత్నియగు కాలియు, ఇంద్రుని పత్నియగు ప్రచండచండియుఁగూడ నొక్కతియే యయినను కార్యభేదము వలన నామభేదమేర్పడిదని భావము.

మూ॥ అయిత్వామేవేన్ద్రం కథయతి మునిః కశ్చిదజరే!
త్వయాశస్త్రాథ్యంతం భణతితు పరస్తత్త్వవిద్భుషిః
యువాం మాతాపుత్రౌ భగవతి! విభాజ్యౌ సభవతః
తతోధీనాం ద్వేధా విబుధజనగోష్ఠీషు గతయః 15

నిత్యయౌవనవగు జననీ! ఒకఋషి (తత్త్వదర్శి) నిన్నే యింద్రునిగాఁ జెప్పుచున్నాఁడు. ఇంకొక తత్త్వ విదుఁడగు ఋషి- ఆ యింద్రునికి నీవే ఆయుధమని చెప్పుచున్నాఁడు. భగవతీ! శక్తివగునీవును, భగవంతుఁడగు నాయింద్రుఁడును, ఎడబాటు లేని మాతా పుత్రులగుచున్నారు. కావుననే విద్వజ్జనపరిషత్తులయందు బుద్ధిగతులు - ద్వివిధములగుచున్నవి.

ప్రభ:-గతియనఁగా నిచట మార్గమని యర్థము. ఒక ఋషి - లింగభేదము యథార్థము కాదను తలపున 'నీవే యింద్రుఁడవు' అనఁగా 'పరమేశ్వరుఁడవు'



అని చెప్పుచున్నాఁడు. ఇంకొక తత్త్వజ్ఞాని 'నీవింద్రుఁడవు కావున నీవు పరమేశ్వరుఁడగు నా యింద్రుని శక్తివి.'' అని చెప్పుచున్నాఁడు. ఇట్లు విద్వజ్జనాభిప్రాయము ద్వివిధయై యున్నదని యర్థము.

మూ॥ వికుర్వాణావిశ్వం వివిధగుణభేదైః పరిణమద్
విధున్వానాభావాన్ భువనగతిరోధాయ భవతః।
వితన్వానాశర్వం చలవదచలం కాచిదవితుం
విచిన్వానాజన్తోః కృతలవమపీశా విజయతే॥ 16

పరిణమించుచున్న విశ్వమును - సత్త్వాదిగుణ తారతమ్య వినిమయము చేతనగు (గుణ) భేదముల చేత పరివృత్తి నొందించునదియు, ప్రచండగమనము నడ్డగింపఁబూనిన భావములను (చేష్టలను) నివారించునదియు, అచలుఁడగు (కదలిక లేని) పరమేశ్వరుని చలించు వానిని వలె విస్తరింపఁజేయునదియు, జంతువులచే నొనర్పఁబడిన కర్మయొక్క ఫలలేశమును గూడ రక్షించుటకు గవేషించునదియు, ఇట్టిదని చెప్పుటకు శక్యముకానిదియు, అగు ఈశ్వరి - జయించుచున్నది. (విశేషించి వెలయుచున్నది.)

ప్రభ:-- పరమేశ్వర - అనిర్వచనీయ స్వరూపిణి. ఆయమ్మ - పరిణామియగు జగత్తును నానావిధ గుణభేద విశిష్టముగాఁ జేయుచు, విశ్వగతిప్రతిబంధకములగు అసుర చేష్టలను నివారించుచు, చలనరహితుఁడగు నీశ్వరుని చలన సహితుని వలె నొనరించుచు, ప్రాణుల కర్మలేశమును గూడ జాగరూకయై వెదకుచు, విభాసించునని యర్థము.

మూ॥ ప్రభాభానోర్యద్వద్ భవసి సకలస్యాపి తపనీ
ప్రచణ్డాశక్తిః సత్యఖిల భువనేశస్య తపతః।
సుధాంశో ర్జ్యోత్స్నేవ ప్రమదయసి చేతః ప్రవిశతో
భవన్తీ భూతాదేర్దహరకుహరం మోదలహరీ॥ 17

అమ్మా! సూర్యునికి – ప్రభవలె, సర్వలోకాశ్రయుఁడగు నీశ్వరునికి నీవు ప్రచండయగు శక్తివై – సర్వలోకమునకును గూడ తపన శక్తివగుచున్నావు. సుధాంశుని జ్యోత్స్నవలె హృదయాకాశమును ప్రవేశించిన భూతాదియగు (పృథివ్యాదులకు గాని, ప్రాణులకుఁగాని మూలభూతుఁడగు) ఆత్మకు (అంతరాత్మకు) మోదలహరివై, మనస్సును ప్రహర్షింపఁజేయుచున్నావు. సూర్యప్రభవలె ఉగ్రవై శక్తిని ప్రకటించుచున్నావు. చంద్రప్రభవలె సౌమ్యవై ఆనందమును గలిగించుచున్నావు. (''అఙ్గుష్ఠమాత్రః పురుషోఽన్త రాత్మా'' అని వినఁబడుచున్నది గదా!)

మూ॥ ప్రచణ్డా గౌరీవా త్వమసి వసురుద్రార్క వినుతే!
స భీమః శమ్భుర్వా విభురభయదః పాదసుహృదామ్।
తయోరేకం రూపం తవ సహవిభోః ఖేలతి మహ
త్యముష్మిన్నాకాశే ధవలమహసి క్రీడతి పరమ్॥ 18

(భూర్భువః స్వర్లోకములకధికారులగు) వసు–రుద్ర– ఆదిత్యులచేత సన్నుతవగు జననీ! నీవు ప్రచండవు గాని, ( ఉగ్రవగు చండివిగాని) గౌరివిగాని, (సౌమ్యవుగాని) అగుదువు. పాదబంధువులగు భక్తుల కభయమునిచ్చువాఁడగు ఆయీశ్వరుఁడు– భీముఁడుగాని, ( ఉగ్రుఁడుగాని) శంభుఁడుగాని, (సుఖమయుఁడగు సౌమ్యుఁడుగాని) అగును. ఇట్లు – సేశ్వరవగు (విభునితోఁగూడినదానవగు) నీకు – అందు మొదటిరూపము ( చండీరూపము) ఈ మహాకాశమున ఖేలనమొనర్చుచుండును. రెండవది (గౌరీ రూపము) ధవలజ్యోతియగు సోముని యందు విహరించుచుండును.

**ప్రభ:-** సూర్యప్రభవలె ఉగ్రవై శక్తిని ప్రకటించుచున్నావు. చంద్రప్రభవలె సౌమ్యవై ఆనందమును గలిగించుచున్నావు.



మూ॥ విభక్తా యాద్వేధాత్వమపి గగనేశీతమహస
స్తథారమ్యే బింబే జ్వలిత లలితశ్రీ తనువిధా
తయోర్భ్రూహీశానే జనని! కతమామే జననభూః
పురాజన్మన్యాసీ ద్వికటుమథవోగ్రైవసుషువే॥ 19

నీవు ద్వివిధముగా విభజింపఁబడి జ్వలితమగు (ప్రతప్తమగు) స్త్రీశరీరవిధము వంటి విధము గల చండివి, లలితమగు (కోమలమగు) స్త్రీశరీరవిధమువంటి విధము గల గౌరివి, అగుచు ఆకాశమునందును – శీతకిరణుని మనోహరబింబము నందును – నివసించుచున్నావు. ఈశ్వరివగు జననీ! ఆ చండీ – గౌరీ మూర్తులయందు – ఏ మూర్తి – పూర్వజన్మమున నాకు జన్మస్థానమయినదో చెప్పుము. ఒకవేళ – ఆకాశమునందున్న చండీమూర్తియే వికటనాముఁడనగు నన్నుఁగన్నదా!

**ప్రభ:-** నా జన్మభూమి – చండీగర్భమా? గౌరీ గర్భమా? లేక ఆకాశమునందు జ్వలించుచున్న చండియే – 'గజము ఖుఁడగుట చేత వికటుఁడ' ని చెప్పఁబడిన గణపతిని గనినదా? మీఁది శ్లోకము చేత – దీనికి సమాధానమును దానే చెప్పుచున్నాఁడు.

మూ॥ దృశోర్భేదాద్ దృష్టేర్నభవతి భిదాకాఽపి కరయో
ర్నభేదాద్ భిన్నంస్యాత్ కృత, మఖి విమానైక్య వశతః।
భిదాతన్వోరేవం నభవతి భిదాయై తవ శివే!
వియద్దేశే చణ్డ్యాం సితమహసి గౌర్యాంచ భవతీ॥ 20

దృక్కులు వేరయినను, దృష్టి యేదియుఁగూడ వేఱుకాదు. (కన్నులు రెండయినను, చూపునందు భేదమేదియు లేదు) చేతులు వేరయినను, పనివేరు కానేరదు. శివస్వరూపిణివగు జననీ! ఇట్లు స్వీయమగు ఉత్కర్షావబోధనము యొక్క ఏకత్వవశము వలన – వియద్దేశమునందున్న చండియందును, సితకరునియందున్న గౌరియందును గల శరీరభేదము – నీకు భేదమును గూర్పఁజాలదు.

ప్రభ:- నేత్రములు రెంటికిని గూడ - దర్శనమొక్కటియే యగును. దర్శనమునందు భేదముండదు. హస్తద్వయము చేత నొనర్పఁబడిన కార్యము - హస్తభేదము వలన భేదించునది కాదు. ఇట్లే అభిన్నమగుట వలన నీ స్వరూపము కూడ - చండీ - గౌరీ - శరీరభేదము చేత - భేదించునది కాదని భావము. దృక్కులు రెండున్నను, దృష్టులు రెండుకావు. హస్తములు రెండున్నను పనులు రెండుకావు. ఇట్లే - చండీ - గౌరీ శరీరములు - రెండయినను దేవీ స్వరూపములు రెండు కావని చెప్పఁబడినది. ఇచ్చట - దృక్కులు రెంటికిని 'దర్శన' మొక్కటియే యగునట్లును, హస్తములు రెంటికిని 'కార్య' మొక్కటియే యగునట్లును, 'చండీ - గౌరీ శరీరములకు శరీరియగు స్వరూప మొక్కటియే' అని యుపమ గమ్యమగుచున్నది. ఇట్లనుట చేత - దర్శనమునకు దృగ్ద్వయము వలె, దేవీ స్వరూపమునకు -చండీ - గౌరీ శరీరద్వయము స్వభావ సిద్ధమను నంశము స్ఫురించుచున్నది. ''అనుమితికర మగుటవలన సామాన్య విశేషముల చేత ఆలింగితము కానిదియు, ప్రకృతమగునర్థము నుపపాదించునదిగా వివక్షింపఁబడినదియు, నగు అర్థము - కావ్యలింగము'' అని రసగంగాధర కారులు తెలిపియున్నారు. కావున నిచట ''శరీరభేదము వలన - స్వరూప భేదము కలుగదు'' అను ప్రకృతోపపాద్యమగు నర్థమునకు - పూర్వార్ధమునందుఁ జెప్పఁబడిన ''దృక్కులు వేరయినను'' ఇత్యాది వాక్యద్వయము - అనుమితికరముగాఁ జెప్పఁబడుట వలన నిది - కావ్యలింగాలంకార మగుచున్నది. ఇందు - ప్రకృతాప్రకృతములకు సామాన్య విశేష భావము - కాన్పింప కుండుట వలన - నిది యర్థాంతరన్యాసమని శంకింపఁదగదు.

మూ॥ తవచ్ఛిన్న శీర్షం విదురఖిలధాత్ర్యాగమవిదో
మనుష్యాణాంమస్తే బహులతపసాయద్ విదలితే
సుషుమ్నాయాం నాడ్యాం తనుకరణసమ్పర్క రహితా
బహిశ్శక్త్యాయుక్తా విగతచిర నిద్రా విలసతి॥ 21



విశ్వభర్త్రి! గాఢమగు తపస్సు చేత - మనుష్యుల శీర్షము - ద్వివిధముగా చీల్చఁబడునపుడు - జ్యోతిర్వాహినియు, సుషుమ్నాఖ్యయు, నగు మధ్యనాడి యందు దేహేంద్రియాది సంబంధవర్జితవు, బ్రహ్మాండగతమగు బహిశ్శక్తితో (మహాశక్తితో) సంయుక్తవు, నిద్రను విడిచి మేల్కొన్నదానవు. అగు కుండలినివై - విలసిల్లుదువు. కావున ఆగమవిధులుగ తాంత్రికులు - నీ శీర్షము - ఖండింపఁబడినదని (నీవు ఛిన్నమస్తవని) తెలిసికొనుచున్నారు.

ప్రభ:- ''కుండలినీ శక్తి - యోగులయందు మేల్కొని, సుషుమ్నయందు ప్రవహించుచు, శరీరము నాశ్రయింపక - శీర్షకపాలమును భేదించుకొని - బయటికి వెడలి, వెలుపలనున్న బ్రహ్మాండశక్తితోఁగూడినదై - వెలుపలికిని లోపలికిని రాకపోకలు గావించుచు - విలసిల్లును'' అను నీయభిప్రాయమును స్వానుభవము చేత నితర శ్లోకములయందుఁగూడ నీకవి చెప్పుచున్నాఁడు. 'తవచ్ఛిన్నంశీర్షమ్' అనుటకు బదులు 'తవచ్ఛిన్నంమస్తమ్' అను పాఠాంతరముగూడఁ గలదని గ్రహించునది.

విశే:- జీవించియున్న యోగి యొక్క శీర్షకపాలమును గూడ భేదింపఁబడునను నంశము - శ్రుతి సిద్ధమును, అనుభవసిద్ధమును, అగుచున్నది. 'వ్యపోహ్య శీర్షకపాలే అని తైత్తరీయక శ్రుతి చెప్పుచున్నది. శీర్షకపాల భేదము వలన- ఏ యోగి ప్రాణము - సుషుమ్నాద్వారమున వెడలునో, అతఁడు బ్రహ్మ లోకమునొందును. మృతినొందిన తురియాశ్రమికుని (సన్యాసి యొక్క) శరీరమును ఖననమొనర్చుటకు (పాతుటకు ముందు నారికేళ ఫలము చేత వాని శిరస్సును పగులఁగొట్టు సంప్రదాయము - ఇప్పటికిని గలదు. (అది - బ్రహ్మలోకప్రాప్తి హేతువుగాకున్నను) ఈ సంప్రదాయము - యోగి - ప్రాణములు- బ్రహ్మరంధ్రము నుండి నిర్గమించునను యభిప్రాయమునే స్మరింపజేయుచున్నవి.

మూ॥ ఉతాహోతన్వఙ్గ్యాం భృగుకుల విధాత్ర్యాం పితృగిరా
తనూజేనచ్ఛిన్నే శిరసి భయలోలాక్షినలినే
న్యధాస్తే జోఖీమం నిజమయి యద క్షుద్రమనఘం
తదాహుస్త్వామమ్బ! ప్రథితచరితే కృత్తశిరసమ్॥ 22

దేవీ! నీవు ఛిన్నమస్తవగుట కిది హేతువు కాని యెడల – భయము చేత చకితములగు నయనకమలములు గల రేణుక శిరస్సును తండ్రి యొక్క ఆ దేశము చేత పుత్రుఁడగు పరశురాముఁడు ఛేదించునపుడు, భృగువంశ విధాత్రియు, సుందరియు, జమదగ్ని భార్యయు, నగు ఆ రేణుక యందు నీవు ఉత్తమమును, పవిత్రమును, ఉగ్రమును అగు నిజతేజమును ప్రవేశింపఁజేసితివాయేమి? విశ్రుత చరిత్రవగు జననీ! కావుననే నిన్ను ఛిన్నమస్తనుగా (ఖండింపఁబడిన శిరస్సుగల దానినిగా) చెప్పుచున్నారు.

ప్రభ:- పరశురాముఁడు మాతృశీర్షమును ఛేదించునపుడు – భగవతియగు ప్రచండ చండి – ఆమె యందు తన తేజమునుంచెను. స్వతేజో నివాసభూమియగు రేణుక – ఛిన్న శిరస్కయగుట వలన, ప్రచండచండి కూడ – 'ఛిన్నమస్త' అని కీర్తింపఁబడుచున్నదని భావము.

మూ॥ హుతం ధారాజ్వాలా జటిల చటులే శత్రుదహనే
తపస్విన్యాః కాయం భగవతి। యదామ్బ! త్వమవిశః।
తదాతస్యాఃకణ్ఠ ప్రగలదసృజః కృత్తశిరసః
కబన్ధేన ప్రాప్తో భువనవినుతః కోఽపిమహిమా॥ 23

అమ్మా! అవిచ్ఛిన్నమును, ధారాకారమును, అగు జ్వాలచేత జటిలమును, (సాంద్రమును) చటులమును, (శీఘ్రమును, కావుననే, ప్రచలమును) అగు ఖడ్గాగ్నియందు హోమము చేయఁబడిన తపస్విని యగు రేణుక దేహమునందు నీవు ప్రవేశించినపుడు ఛిన్నమస్తయగు రేణుక యొక్క కంఠము నుండి బయలు వెడలుచున్న రక్తము నుండి – లోక సంస్తుతమగు నేదో మహిమ – శిరోవియుక్తమగు కళేబరమగు కబంధము చేత – పొందఁబడియుండవచ్చును.

ప్రభ:- కబంధమనఁగా, తలలేని మొండెము – కబంధరూపిణియగు రేణుకా దేవి – లోకమునందిప్పటికిని పూజింపఁబడుచున్నది.

మూ॥ నిధేస్త్వత్తో హృత్వా భగవతి! నలజ్జే భువిసృజన్
రసక్షోణీర్వా స్త్వదమలయశస్సౌరభజుషః
నృపోద్యానాత్ సూనోత్కర మనహరన్ భక్తినటనం
వితన్వానస్తస్మై ముహురుపహారం త్సేవక ఇవ॥ 24

భగవతీ! స్వచ్ఛములగు నీయశస్సుల సౌరభమును సేవించునవియు, రసభూములును, అగు వాణులను – సర్వరసమధుర వాఙ్మయ నిధివగు నీనుండి (నీయొద్ద నుండి) హరించి (దొంగిలించి, తీసికొని) యీలోకమున కావ్యరూపమున సృజించుచున్న నేను ప్రభుని యుద్యానము నుండి పుష్పరాశి నపహరించి ఆ ప్రభునియందు భక్తిని (సగౌరవానురాగమును) నటించుచు – అతనికి మాటిమాటికిని కానుకగా నొసఁగు సేవకుని వలె, నేలజ్జించువాఁడను కాకున్నాను.

ప్రభ:- నృపాలుని యుపవనము నుండి కుసుమ రాశిని దొంగిలించి – స్వీయమగు దానివలెఁ జేసికొని – బాహ్య చేష్టితముల చేత – భక్తినటనమును గావించుచు, ఆ ప్రభువునకు మాటిమాటికిని కుసుమోపాయనమును గావించుకింకరుని వలె నీయొద్ద నుండి హరించిన రసమయ వాక్కుల చేత – కావ్య నిర్మాణము నొనర్చుచున్న నేను లజ్జితుఁడను కాకున్నానని భావము. 'నిధివగు

నీనుండి' అనుట వలన - ఈకవిత - దేవీ ప్రసాద విశేలబ్ధమని స్ఫురింపఁజేయఁ బడుచున్నది. ' ఈ లోకమున సృజించుచున్న'దని అనుటచేత ' ఈ సృష్టి - అభినవము' అనునంశము – ద్యోతితము.

మూ॥ దధానాస్సన్తోషం మనసి సుకవీనామతితరాం
దధానాః ప్రత్యగ్రం విబుధసదసే భావమలఘుమ్
కులానాముత్సాహం సపది విదధానా శ్శివవధూ
పరాణాం శోభన్తాం జగతి శిఖరిణ్యోగణపతేః॥ 25

రసాస్వాదననిపుణులును, నిర్మత్సరులును, అగు సత్కవుల మనస్సునందు సంతోషము నతిశయింపఁజేయునవియు, విద్వత్ పరిషత్తునకు – అనల్పమును, అభినవమును, అగు అభిప్రాయము నొసఁగునదియు, శివవధువగు భగవతియే ప్రధానముగాఁగల దేవీ భక్తుల యొక్క సంఘములకు వెంటనే యుత్సాహమును గూర్చునవియు, శిఖరిణీవృత్తములచే రచింపఁబడినవియు, అగు గణపతి కృతస్తుతులు – లోకమునందుద్దీపించుఁగాత!

ఇది - సవ్యాఖ్యమగు సప్తవింశ స్తబకము

* * * *



ఓం నమోభగవతే శ్రీరమణాయ

# ఉమాసహస్రము

## (సప్తమ శతకము – చతుర్థ స్తబకము)
## అష్టావింశ స్తబకము.

మూ॥ అన్తర్జ్వలక్ష పరిధి భ్రమమా దధానో
వక్త్రస్య పూర్ణతుహినద్యుతి మణ్డలస్య
హాసః కరోతు భవతాం పరమం ప్రమోదం
శుద్ధాన్త పఙ్కజదృశః ప్రమథేశ్వరస్య॥ 1

ప్రమథ గణముల కీశ్వరుఁడగు పరమశివుని యొక్క అంతఃపుర సుందరియగు పార్వతియొక్క వదనపూర్ణ చంద్రబింబమునకు చుట్టును, శుభ్రమగు పరివేషభ్రమము నుత్పాదించునదియగు, నామెహాసము – మీకు పరమానందము నొసఁగుఁగాత!

ప్రభ:- ముఖము చుట్టును గూడ – హాస ప్రభచేత మండలాకారమగు విలాసము గలదని స్ఫురింపఁజేయుటకు– ముఖచంద్రునికి హాసము – పరివేషము నావరించినట్లున్నదని చెప్పఁబడినది. అలంకారము – రూపకము.

మూ॥ సమ్మోహనాని తుహినాంశు కలాధరస్య
సఞ్జీవనాని సరసీరుహ సాయకస్య
సన్దీపనాని వితనోతు జనేషుశక్తేః
సంహర్షణాని మమసన్తు శివాస్మితాని॥ 2